

నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు

కమ్యూనిస్టులే వీర తెలంగాణ వారసులు

- సాయుధ పోరుకు మతం రంగు పులమడం దుర్మార్గం
- అమరుల త్యాగాలను ముందుకు తీసుకెళ్లేందుకే 'శౌర్యయాత్ర'
- స్ఫూర్తిని కొల్పిన 'వీర తెలంగాణ వీధి నాటిక'


ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టి చాకిరి విముక్తి కోసం.. సాగిన వీర తెలంగాణ విప్లవ సాయుధ రైతాంగ పోరాటానికి కమ్యూనిస్టులు తప్ప మరెవ్వరూ వారసులు కాలేరని, ఎర్ర జెండా సాగించిన పోరాటం వల్లనే నిరంకుశ నిజాం ప్రభువు పీడ విరగడైందని పలువురు వక్తలు తెలిపారు. వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో చేపట్టిన "శౌర్యయాత్ర" మంగళవారం సంగారెడ్డి జిల్లాలోని జోగిపేట, సంగారెడ్డి పట్టణాలకు చేరుకుంది. 1930లో తొలి ఆంధ్రమహాసభ జరిగిన జోగిపేట గడ్డలో శౌర్యయాత్ర కొనసాగింది. జోగిపేటలోని క్లాక్‌టవర్, సంగారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన శౌర్యయాత్ర సభల్లో సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.సాయిలు మాట్లాడారు. జోగిపేటలో జరిగిన తొలి ఆంధ్ర మహాసభ స్ఫూర్తితో తెలంగాణ పరగణంతా పోరాట క్షేత్రాలుగా మారాయన్నారు. నిజాం నిరంశ పాలనలో ప్రజలను బానిసలుగా భావించి వెట్టి చేయించారన్నారు. సకల వృత్తిదారులు, శ్రమజీవులంతా కూడా దొరలు, దేశ్‌ముఖ్‌లు, భూస్వాముల ఆగడాలతో చితికిపోయే పరిస్థితుల్లో కమ్యూనిస్టులు సంఘం పెట్టి పోరాడాల్సి వచ్చిందని తెలిపారు. విస్నూరు రామచంద్రారెడ్డి సాగించిన దురాఘతాలను పాలకుర్తిలో ఐలమ్మ, కడవెండిలో దొడ్డి కొమరయ్య ప్రతిఘటించి తిరగబడి పోరాటం చేశారని గుర్తు చేశారు. దొడ్డి కొమరయ్య బలిదానంతో తెలంగాణ అంతటా సామాన్యులే సాయుధులై బంధూకులు, బడిసెలు, ఒడిసేలలు చేతబట్టి దొరలకు వ్యతిరేకంగా తిరుగుబాటు పోరాటం సాగించిన ఫలితంగా నిజాం ప్రభు లొంగిపోయాడన్నారు. ఎర్ర జెండా నాయకత్వంలో వేలాది గ్రామాలు విముక్తిని సాధించడమే కాకుండా లక్షలాది ఎకరాల భూముల్ని భూమిలేని పేదలకు పంపిణీ చేయబడిందని చెప్పారు. రాజరిక నిజాం నిరంకుశ పాలన పోయినప్పటికీ ప్రజాస్వామ్య వ్యవస్థలో నయా నిజాంలు మనల్ని పాలిస్తున్నారన్నారు. మతోన్మాదంతో బిజెపి వీర తెలంగాణ సాయుధ పోరాటానికి మతం రంగు పులమడం దుర్మార్గమైన చర్య అని తెలిపారు. నిజాంకు వ్యతిరేకంగా బందగీ, సోయబుల్లాఖాన్ లాంటి మైనార్టీలు సైతం పోరాడి ప్రాణాలర్పించిన చరిత్రను బిజెపి విస్మరిస్తుందన్నారు. తెలంగాణ సాయుధ పోరాట అమరులు అందించిన పోరాట స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న నేటి పాలకులకు వ్యతిరేకంగా సంఘటితంగా పోరాడాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్యం, జిల్లా కమిటీ సభ్యులు విద్యాసాగర్, ఎం.యాదగిరి, పిఎన్ఎం రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్, ఉపాధ్యక్షులు ఏర్పుల వెంకన్న, రాష్ట్ర నాయకులు వినోద్, గంటెపాక శివ, చంద్రమౌళి నాగభూషణం, ఆంజనేయులు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిని నింపిన వీర తెలంగాణ వీధి నాటిక

శౌర్యయాత్ర సందర్భంగా జోగిపేట, సంగారెడ్డిలో పీఎన్ఎం కళా బృందం ప్రదర్శించిన 'వీర తెలంగాణ వీధి నాటిక' ఎంతో స్ఫూర్తిని నింపింది. నిజాం కాలంలో సాగిన నిరంకుశ పాలన, పన్నుల భారాలు, వెట్టి చాకిరి, అత్యాచారాలు, హత్యలకు సంబంధించిన సంఘటనలను కండ్లకు కట్టినట్టుగా కళా రూపంలో ప్రదర్శించారు. వెట్టిని భరించలేక తెగింపుతో సంఘంగా ఏర్పడిన సామాన్యులే తుపాకులు బట్టి తిరగబడిన తెగువ, "బండెనక బండి కట్టి పదహారు బండ్లు కట్టి ఏ బండ్లో పోతవ్ కొడుకో నైజాం సర్కరోడా.." అనే పాట, సన్నివేశాలు పోరాట చైతన్యాన్ని తెలియజేశాయి.

27 నుంచి మీషో మెగా బ్లాక్‌బస్టర్ సేల్



హైదరాబాద్ : ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ మీషో ప్రస్తుత పండగ సీజన్ సందర్భంగా సెప్టెంబర్ 27 నుంచి మీషో బ్లాక్ బస్టర్ సేల్‌ను ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. ఈ పండుగ సీజన్‌లో వినియోగదారులకు అనేక సరసమైన ఎంపికలను అందించడానికి దీన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. 30 కేటగిరీలలో 20 లక్షల మంది విక్రయదారులు దాదాపు 12 కోట్ల ఉత్పత్తులను తమ వేదికపై విక్రయానికి అందుబాటులోకి తెస్తున్నారని తెలిపింది.

వ్యాపార కార్యకలాపాలు మందగింపు

న్యూఢిల్లీ : ఈ ఏడాది సెప్టెంబర్‌లో దేశంలో ఆర్థిక కార్యకలాపాలు మందగించాయని హెచ్ఎస్‌బిసి ఫ్లాష్ ఇండియా కంపోజిట్ పిఎంఐ అవుట్‌పుట్ ఇండెక్స్ వెల్లడించింది. 2024 ఆగస్టులో తయారీ పిఎంఐ 57.5గా ఉండగా.. సెప్టెంబర్ 56.7గా ఉందని పేర్కొంది. ఇదే సమయంలో వ్యాపార కార్యకలాపాలు 60.9 నుంచి 58.9 తగ్గాయని అంచనా వేసింది.

మివి నుంచి టిడబ్ల్యూఎస్ ఇయర్‌బడ్‌ల ఆవిష్కరణ



హైదరాబాద్ : దేశీయ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ మివి ఆడియో పరికరాల పరిశ్రమలో తనదైన శైలీలో 'హియర్ క్లియర్' క్యాంపెయిన్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. అదే విధంగా సూపర్‌పాడ్స్ ఇమ్మర్సియో టిడబ్ల్యూఎస్‌ను ఆవిష్కరించినట్లు పేర్కొంది. తమ తాజా ఫ్లాగ్‌షిప్ శ్రేణి టిడబ్ల్యూఎస్ ఇయర్‌బడ్‌లు, సూపర్‌పాడ్‌లను విడుదల చేయటంతో, ప్రీమియం టిడబ్ల్యూఎస్ కేటగిరీలో 10 శాతం మార్కెట్ వాటాను సాధించాలని మివి లక్ష్యంగా పెట్టుకున్నామని ఆ సంస్థ సహ వ్యవస్థాపకులు, సిఎంఒ మిధులా దేశభక్తుని తెలిపారు. తమ ఉత్పత్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ లభ్యమవుతాయన్నారు.

అగ్రి చెయిన్‌లో 20 లక్షల మహిళలకు మద్దతు

- కోర్టెవా అగ్రిసైన్స్ వెల్లడి

న్యూఢిల్లీ : వచ్చే 2030 నాటికి దేశంలోని వ్యవసాయ రంగం వాల్యూ చెయిన్‌లో 20 లక్షల మంది మహిళలకు మద్దతును ఇవ్వనున్నామని కోర్టెవా అగ్రిసైన్స్ పేర్కొంది. ఇందుకోసం బోల్డ్ న్యూ ప్రోగ్రాం పేరుతో మహిళలను రైతులు, పరిశోధకులు, ఔత్సాహికులుగా తీర్చిదిద్దాలని నిర్దేశించుకున్నట్లు పేర్కొంది. ఇది ఆహార భద్రతను పెంచుతుందని కోర్టెవా అగ్రిసైన్స్ దక్షిణాసియా ప్రెసిడెంట్ సుబ్రోటో గీడ్ పేర్కొన్నారు. మెరుగైన వ్యవసాయ పద్ధతులు, విద్య, సుస్థిరమైన వ్యవసాయపద్ధతులపై అవగాహన పెంచనున్నామన్నారు.

పలు గెలాక్సీ సిరీస్‌లపై ప్రత్యేక తగ్గింపులు

గూర్‌గావ్ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ తన గెలాక్సీ ఎస్, ఎం, ఎఫ్ సరీస్ స్మార్ట్‌ఫోన్లపై ప్రత్యేక డిస్కౌంట్లను అందిస్తున్నట్లు తెలిపింది.గెలాక్సీ ఎస్ 23 ఎఫ్ఇ అసలు ధర రూ.54,999 కాగా.. దీన్ని రూ.27,999కు అందిస్తున్నట్లు పేర్కొంది. గెలాక్సీ ఎస్ 23 ధరను రూ.74,999 నుండి రూ.37,999కి తగ్గించినట్లు తెలిపింది. రూ.1,09,999 గెలాక్సీ ఎస్23 అల్ట్రాను రూ.69,999కే అందుబాటులో ఉంటుందని పేర్కొంది. గెలాక్సీ ఎస్ 24 అల్ట్రా అసలు ధర రూ. 1,29,999 కాగా ఇప్పుడు కేవలం రూ.1,09,999కు అందుబాటులో ఉంటుందని తెలిపింది.

చెరువుల ఆక్రమణల్లో నివసించే పేదలకు డబుల్ ఇళ్లు

- వివరాలు సేకరించాలని సిఎం ఆదేశం
- చెరువుల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు
- కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం
- చెరువులు, నాలాల బఫర్ జోన్లు నిర్ధారించాలి
- సిఎం రేవంత్ రెడ్డి


సమీక్షలో అధికారులతో మాట్లాడుతున్న సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో ఆక్రమిత చెరువులు, నాలాలతో పాటు మూసీ పరివాహక ప్రాంతంలో నివసించే అర్హులైన పేదల వివరాలను సేకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. జూబ్లీ హిల్స్‌లోని సిఎం నివాసంలో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్, హైదరాబాద్ మెట్రో రైలు పై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అర్హులైన పేదలకు భరోసా కల్పించేందుకు తప్పకుండా ప్రయత్నం చేయాలని అధికారులకు సూచించారు. అర్హులైన పేద కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉండకూడదని, వారికి డబుల్ బెడ్రూం ఇల్లు కేటాయించాలని, లేదా ఇతర ప్రత్యామ్నాయం చూపించాలని ఆదేశించారు.

ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న చెరువులు, కుంటల పరిరక్షణను బాధ్యతగా చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని వాటిని కాపాడుకోవాల్సిన అవశ్యాన్ని గుర్తు చేశారు. ఇకపై చెర్వులు, నాలాలు ఆక్రమణలకు గురి కాకుండా పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. ఇందులో భాగంగా సిటీలో ఉన్న అన్ని చెరువుల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్ కు అనుసంధానం చేయాలని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న చెరువులు, కుంటలు, నాలాలు అన్నింటినీ గుర్తించి ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్లను గుర్తించాలని చెప్పారు. హైదరాబాద్ సిటీలో అవుటర్ రింగ్‌రోడ్డు లోపల ఉన్న ప్రతీ చెరువు, నాలాల ఆక్రమణల వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. వీటికి సంబంధించిన పూర్తి స్థాయి నివేదికను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. అదే సమయంలో నిజమైన, అర్హులైన పేదలకు నష్టం జరగకుండా ప్రభుత్వం చేపట్టే చర్యలుండాలని అప్రమత్తం చేశారు.

ఎయిర్ పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీకి మెట్రో మార్గానికి సంబంధించి పూర్తి స్థాయి నివేదికను రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఓల్డ్ సిటీ మెట్రో విస్తరణ పనులను వేగంగా చేపట్టాలని చెప్పారు. మెట్రో మార్గాలకు సంబంధించిన భూసేకరణ, ఇతర అడ్డంకులుంటే అధికారులు వాటిపై ప్రత్యేకంగా దష్టి సారించి, పరిష్కరించాలని సూచించారు. ఎల్బీ నగర్ నుంచి హయత్ నగర్, ఎంజిబిఎస్ నుంచి చాంద్రాయణగుట్టతో పాటు మెట్రో విస్తరణకు సంబంధించి పలు అంశాలను ఈ సందర్భంగా అధికారులు సిఎంకు వివరించారు. దసరాలోపు మెట్రో విస్తరణ రూట్ కు సంబంధించి పూర్తిస్థాయి డిపిఆర్‌ను సిద్ధం చేసి కేంద్రానికి సమర్పించాలని సిఎం చెప్పారు.

మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్, మెట్రో రైల్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డి, సలహాదారు శ్రీనివాసరాజు, సిఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

మా సమస్యలను పరిష్కరించండి

- మంత్రి సీతక్కను కలిసిన మధ్యాహ్న భోజన కార్మికులు


సీతక్కను కలిసి సమస్యలను వివరిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మంత్రి సీతక్కను కలిసి విన్నపించినట్టు సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల మధ్యాహ్న భోజన కార్మికుల అధ్యక్షులు సంతోషి తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలంటే మార్కెట్‌లో పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రతి విద్యార్థిపై డబ్బులు పెంచాలని, నెలనెలా గౌరవ వేతనం వచ్చేలా చూడాలని కోరారు. హరే రామ హరే కృష్ణ ట్రస్ట్‌కు మధ్యాహ్నం భోజనం అప్పగించవద్దని మంత్రిని కోరినట్టు తెలిపారు. సమస్యలన్నింటినీ పరిష్కారం చేసేలా కృషి చేస్తానని మంత్రి మాట ఇచ్చినట్టు చెప్పారు.

పిడుగుపాటుకు ఇద్దరు మృతి

- ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తుండటంతో పిడుగులుపడి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇద్దరు మృతిచెందగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. రంగారెడ్డి, ఆదిలాబాద్ జిల్లాల్లో గేదెలు, లేగదూడలు మృత్యువాతపడ్డాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలోని జగ్గారం గ్రామంలో అరటితోటలో పనిచేస్తున్న కూలీలపై పిడుగుపడటంతో ఇద్దరు మృతి చెందారు. ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. జగ్గారం గ్రామంలో కౌలు రైతు రవిరాజు తోటలో వ్యవసాయ పనులకు పలువురు గిరిజన కూలీలు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురుస్తుండటంతో కూలీలు బయటకు పరుగులు తీశారు. రోడ్డుపై ఆటో కోసం వేచిచూస్తుండగా వారి సమీపంలో పిడుగు పడడంతో కట్టం నాగశ్రీ(16), సున్నం అనూష(23) అక్కడికక్కడే మృతి చెందారు. రాజమ్మ, సీతమ్మ, రత్తమ్మ అనే ముగ్గురు మహిళా కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. సీతమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం తరలించారు. రంగారెడ్డి జిల్లాలో పిడుగుపాటుకు మూడు పాడి ఆవులు మృత్యువాత పడ్డాయి. యాచారం మండలం మాల్ అనుబంధ గ్రామం కిషన్‌పల్లిలో రైతు కలకొండ నరసింహ తన పొలం వద్ద ఆవులను కట్టేశాడు. సోమవారం అర్ధరాత్రి పిడుగు పడటంతో రెండు ఆవులు మృత్యువాత పడ్డాయి. వాటి విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని రైతు తెలిపారు. కొందుర్గు మండలం తంగళ్లపల్లి గ్రామంలో పశువుల కొట్టం పైన పిడుగుపడి పాడి ఆవు మృత్యువాత పడింది. రూ.లక్ష వరకు నష్టం జరిగిందని బాధిత రైతు గొల్ల లింగం తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా లోకేశ్వరం మండలంలో పిడుగుపడి రెండెద్దులు, లేగదూడ మృత్యువాతపడ్డాయి.

శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ వ్యవస్థ ప్రక్షాళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వాస్పత్రుల్లో శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. వారికి బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరి చేయాలని ఆదేశించారు. హాస్పిటళ్ల సూపరింటెండెంట్ల తోపాటు, డిఎంఇ, డిహెచ్, వివిప కమిషనర్ కూడా తమ పరిధిలోని హాస్పిటళ్లలో పని చేస్తున్న వారి బయోమెట్రిక్ అటెండెన్స్‌ను పర్యవేక్షించాలని సూచించారు. రోగులతో ఎలా మాట్లాడాలో కింది స్థాయి సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ మేరకు మంగళవారం ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆఫీసులో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. డైట్, సానిటేషన్ సెక్యూరిటీ, పేషెంట్ కేర్ విభాగాలకు ప్రతి నెలా సకాలంలో నిధులు మంజూరు చేయాలనీ, సిబ్బందికి వేతనాలు చెల్లించాలని మంత్రి ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

శానిటేషన్, సెక్యూరిటీ విషయంలో ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్స్, కార్పొరేట్ హాస్పిటల్స్ అవలంభిస్తున్న విధానంపై అధ్యయనం చేయాలనీ, ఇందుకోసం ఎక్స్‌పర్ట్ కమిటీని నియమించాలని హెల్త్ సెక్రటరీని మంత్రి ఆదేశించారు. హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, సెక్యూరిటీ విభాగాల పనితీరు, హెచ్ఆర్, జాబ్‌చార్ట్‌ను క్షుణ్ణంగా పరిశీలించి, పది రోజుల్లో తనకు కమిటీ నివేదిక అందజేయాలని కోరారు. దవాఖాన్ల వారీగా పేషెంట్ లోడ్, టాయిలెట్స్ సంఖ్య వంటి వివరాలతో నివేదిక తయారు చేయాలనీ, అవసరమైన చోట టాయిలెట్ల సంఖ్య పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు తదితరులు పాల్గొన్నారు.

రేపు పాడి రైతుల ధర్నా

- తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి సాగర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాడిరైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం గురువారం ఇందిరా పార్కు వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి. సాగర్ చెప్పారు. తెలంగాణ పాలఉత్పత్తిదారుల సంఘం, టిజి విజయ డెయిరీ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాకు పెద్ద ఎత్తున పాడిరైతులు తరలిరావాలని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్‌తో కలిసి ఆయన అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సాగర్ మాట్లాడుతూ.. పాడిరైతులకు ఐదు నెలల పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం లీటర్‌కు ఐదు రూపాయలివ్వాలని డిమాండ్ చేశారు. 15రోజులకొకసారి రైతుల ఖాతాలలో జమ చేయాలని కోరారు. పాడి సంరక్షణ, మందులు, 50 శాతంతో గడ్డి విత్తనాలను ఇవ్వాలన్నారు. పాల టెస్టర్లు, చాఫ్‌కట్టర్లు, మిల్క్ అనలైజర్లు సరఫరా చేయాలని కోరారు. పశుపోషణ పథకాన్ని అమలు చేస్తూ ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలని డిమాండ్ చేశారు. మొబైల్ వ్యాన్‌ల ద్వారా రైతుల ఇంటి వద్ద పశువైద్య సౌకర్యం అందించాలన్నారు. పాడి రైతుల పిల్లల చదువులకు స్కాలర్ షిప్‌లు ఇవ్వాలని కోరారు. పశుసంవర్థక శాఖలో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రూ. 150కోట్ల పెండింగ్ బిల్లులకుగానూ కేవలం రూ. 50కోట్లు విడుదల రైతులు ఇబ్బందులు చెప్పారు.

అనుమతులు లేకుండా ఏజెన్సీలకు రూ.1600కోట్ల బ్యాంకు గ్యారెంటీ

పిసి ఘోష్ కమిషన్ విచారణలో ఇంజనీర్లు వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరంపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట ఇంజినీర్లు, మాజీ ఇంజినీర్లు మంగళవారం విచారణకు హాజరయ్యారు. ఉన్నతాధికారులకు తెలియకుండా ఇఇ తిరుపతిరావు ఏజెన్సీలకు రూ.1,600 కోట్ల బ్యాంకు గ్యారంటీలు ఇచ్చినట్టు ఇంజినీర్లు తెలిపారు. బ్యాంకు గ్యారెంటీలను ఏజెన్సీలకు ఇచ్చే ముందు అండర్ టేకింగ్ ఏజెన్సీల నుంచి ఏమైనా తీసుకున్నారా అని కమిషన్ ఇంజినీర్లను ప్రశ్నించింది. ఇఎన్సీ కార్యాలయంలో జరిగిన సమావేశం మినిట్స్ అనుసరించకుండానే విడుదల చేసినట్టు వారు తెలిపారు. ఆనకట్టల వద్ద డ్యామేజ్‌కు గల కారణాలను కమిషన్ అడిగి తెలుసుకుంది. అనుకున్నదానికంటే ఎక్కువ వరద రావడం వల్లే సీసీ బ్లాక్‌లు దెబ్బతిన్నట్టు ఇంజినీర్లు తెలిపారు. 2022 జులైలో వచ్చిన భారీ వరదల కారణంగా సీసీ బ్లాక్‌లు దెబ్బతిన్నట్లు వెల్లడించారు. డ్యామేజి జరిగిన వెంటనే ఏజెన్సీలకు లేఖలు రాసినట్లు కమిషన్‌కు వివరించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించకుంటే సమ్మె

- హాస్టల్ వర్కర్ల ధర్నాలో సిఐటియు నేతలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గిరిజన సంక్షేమ శాఖ (పోస్టుమెట్రిక్ పిఎంహెచ్) హాస్టల్ వర్కర్ల 20 నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ హాస్టల్ డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. మధు డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్ ముందు పిఎంహెచ్ హాస్టల్ ఔట్‌సోర్సింగ్, డైలీవేజ్ వర్కర్లు ధర్నా నిర్వహించారు. అనంతరం రాష్ట్ర నోడల్ ఆఫీసర్ దివ్య, గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్ జిల్లాలో డైలీవేజ్ వర్కర్లకు జిల్లా కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 20 నెలలుగా గిరిజన కార్మికులు చేసిన కష్టానికి వేతనాలు ఇవ్వకపోతే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. వెంటనే బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జూలై 2న ప్రజాభవన్‌లో ధర్నా చేయడంతో చెక్కులను ఆర్థిక శాఖకు పంపించారనీ, రాష్ట్ర వ్యాప్తంగా వర్కర్లకు రావాల్సిన రూ.12 కోట్ల చెక్కులను ఆర్థిక శాఖ పరిధిలో పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. వాటిని వెంటనే రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే నిరవధిక సమ్మె తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టేకం ప్రభాకర్, కార్యదర్శి కె బ్రహ్మాచారి, నాయకులు కృష్ణమాచారి, హీరాలాల్, జలందర్, జయ, తిరుపతమ్మ, ముత్తయ్య, శ్యామ్‌రావ్, సీతారాం, రాంబాయి పాల్గొన్నారు.

రాష్ట్ర రోడ్లను జాతీయ రహదారులుగా అప్ గ్రేడ్ చేయండి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికారాబాద్ నియోజకవర్గంలోని మూడు రాష్ట్ర రోడ్లను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి శాసన సభా స్పీకర్ గడ్డం ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఢిల్లీలోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. అలాగే మరో ఏడు రోడ్లకు సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్స్ స్కీం కింద నిధులు మంజూరు చేయాలని గడ్కరీని కలిసిన వారిలో చేవెళ్ల. చెన్నూర్ ఎంపీలు కొండా విశ్వేశ్వరరెడ్డి, గడ్డం వంశీకృష్ణ, చెన్నూరు శాసనసభ్యులు వివేక్ వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

అక్టోబర్ 16న విచారణకు హాజరుకండి

హైదరాబాద్ బ్యూరో : ఓటుకు నోటు కేసులో అక్టోబర్ 16న విచారణకు హాజరుకావాలని నాంపల్లిలోని ఎసిబి కోర్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆదేశించింది. నాంపల్లి కోర్టులో ఓటుకు నోటు కేసుపై మంగళవారం విచారణ జరిగింది. ఈ కేసులో నిందితులు విచారణకు హాజరుకాకపోవడంపై న్యాయస్థానం అసహనం వ్యక్తంచేసింది.మత్తయ్య సహా మిగిలిన నిందితులు గైర్హాజరయ్యారు.



దరఖాస్తులు అందజేస్తున్న బాధితులు

ప్రజావాణికి 306 దరఖాస్తులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 360 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 138, విద్యుత్ శాఖకు సంబంధించి 38, పంచాయతి రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 36, ఎస్సి సంక్షేమ శాఖకు సంబంధించి 26, మున్సిపల్ శాఖకు సంబంధించి 17, ఇతర శాఖలకు సంబంధించి 105 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిన బాధితుల సమస్యలు తెలుసుకున్నారు.

కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలి

- శ్రమ దోపిడికి గురవుతున్న కార్మికులు
- లేబర్ కోడ్‌ల వల్లే 12 గంటల అదనపు పని
- సంగారెడ్డి క్లస్టర్ స్థాయి దీక్షలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బి మల్లేష్



దీక్షలో కూర్చున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బి మల్లేష్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, నాన్ పర్మినెంట్ కార్మికులు, ఉద్యోగులను శ్రమ దోపిడికి గురి చేసే కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బి మల్లేష్ డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, నాన్ పర్మినెంట్ ఉద్యోగ, కార్మికుల సమస్యలపై చేపట్టిన క్యాంపెయిన్‌లో భాగంగా మంగళవారం సంగారెడ్డి క్లస్టర్ పరిధిలో దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లాలో 1.80 లక్షల మంది కార్మికులున్నారని, అందులో 1.60 లక్షల మంది వరకు కాంట్రాక్టు కార్మికులే ఉన్నారని తెలిపారు. పర్మినెంట్ కార్మికులు, ఉద్యోగుల్లోనూ ఆఫీస్ సిబ్బందే ఎక్కువ మొత్తంలో ఉన్నారన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, నాన్‌పర్మినెంట్ కార్మికుల్లోనూ అత్యధికులు ఉత్తర భారతదేశం నుంచి వలస వచ్చిన కార్మికులే ఉన్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పర్మినెంట్ కార్మికుల్ని పెట్టుకుంటే నెలకు రూ.60 వేల జీతం ఇవ్వాల్సి వస్తుందని, వారి స్థానంలో కాంట్రాక్టు కార్మికులకు రూ.12 వేల జీతమిచ్చి పని చేయించుకుంటూ పరిశ్రమల యజమానులు శ్రమ దోపిడికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1971 కార్మిక చట్టం ప్రకారం కాంట్రాక్టు కార్మికులు నేరుగా ఉత్పత్తిలో పాల్గొన కూడదని, కానీ.. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లలో మాత్రం కాంట్రాక్టు కార్మికులు నేరుగా ఉత్పత్తిలో పాల్గొనే అవకాశం కల్పించబడిందన్నారు. లేబర్ కోడ్‌లు అమల్లోకి వస్తే ఇక నుంచి పర్మినెంట్ అనేది ఉండకుండా పోతుందని వాపోయారు. కాంట్రాక్టు కార్మికుల సంఖ్య పెరిగి పర్మినెంట్ కార్మికుల సంఖ్య తగ్గిపోవడం వల్ల వేతన, ఇతర సదుపాయల కోసం ఎలాంటి ఒప్పందాలు చేసుకోలేని ప్రమాదకర పరిస్థితులు రాబోతున్నాయన్నారు. ఎనిమిది గంటల కంటే ఎక్కువ పని గంటలు డ్యూటీ చేస్తే అదనపు వేతనం కట్టిస్తున్న పరిస్థితులు ఉన్నాయని, కానీ నార్త్ ఇండియా నుంచి పెద్ద ఎత్తున వలస కార్మికుల్ని తీసుకొచ్చి 12 గంటల పాటు పనిచేయించుకుంటున్నారని తెలిపారు. లేబర్ కోడ్‌ల్లోనూ 12 గంటల పని విధానం అమలు గురించి పేర్కొనబడిందన్నారు. మరో పక్క ధరలు విపరీతంగా పెరుగుతున్నా కార్మికుల వేతనాలు మాత్రం పెరగట్లేదన్నారు. రాష్ట్రంలో 2014 నుంచి 2024 వరకు కనీస వేతనాల పెంపు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి జీవోల్ని ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల జిఒ ఇచ్చినా కార్మికులకు పైసా వేతనం పెరగకుండా జిఒ ఇచ్చి కార్మిక లోకాన్ని మోసం చేసిందన్నారు. లేబర్ కోడ్‌లను అమలు చేయాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వం, కనీస వేతనాలు పెంచని రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల్ని తిప్పికొట్టేందుకు దేశ వ్యాప్తంగా చేపట్టిన పోరాటంలో కార్మికులు పెద్ద ఎత్తున కదలాలని పిలుపునిచ్చారు. ఈ నెల 28న కలెక్టరేట్ల ముట్టడి, 30న లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ దీక్షా కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి సాయిలు, జిల్లా ఉపాధ్యక్షులు బాగారెడ్డి, జిల్లా నాయకులు మల్లేశం, ప్రవీణ్, వెంకట్‌రెడ్డి, దయానంద్, సురేష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసమే..

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం : ఎస్ వీరయ్య



ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్ వీరయ్య తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి నుంచి విముక్తి కోసం సాగిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ వీరయ్య అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభలో ఆయన పాల్గొన్నారు. సభకు ముందు ఇటీవల మృతిచెందిన సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం.. దేశ చరిత్రలోనే అత్యంత విలువైన పోరాటమని అన్నారు. దేశంలోని పేద ప్రజలకు భూమి కావాలనే నినాదాన్ని పార్లమెంట్ వరకు తీసుకెళ్లిన ఏకైక పోరాటం సాయుధ పోరాటమని గుర్తు చేశారు. ఈ పోరాటంలో కుల, మత ప్రాంతాలకు అతీతంగా కడుపు కాలిన ప్రతి ఒక్క రైతూ, నిరుపేద ప్రజలు అందరూ కలిసికట్టుగా పోరాటం నిర్వహించారని తెలిపారు. ఇంతటి గొప్ప పోరాటాన్ని రాష్ట్రంలో కొన్ని రాజకీయ పార్టీలు తమ స్వార్థం కోసం ఉపయోగించుకుంటున్నాయని ఆరోపించారు. కేవలం నిజాం నవాబుకు వ్యతిరేకంగా హిందువులు పోరాటం నిర్వహించారని బిజెపి అసత్య ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపికి, ఈ పోరాటానికి ఎలాంటి సంబంధం లేదని, కేవలం ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకే ఇలాంటి వైఖరి బిజెపి తీసుకున్నదని తెలిపారు. దీన్ని కమ్యూనిస్టు పార్టీలు, ప్రజాస్వామికవాదులు తిప్పి కొట్టాలని సూచించారు. ఈ పోరాట దినోత్సవాన్ని కాంగ్రెస్ అధికారికంగా నిర్వహించడంలో తన దొంగ వైఖరి అవలంభిస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శేరిలింగంపల్లి నాయకులు శోభన్, కృష్ణ, మధుసూదన్ రావు, సీతారామయ్య, మాణిక్యం, సుందరయ్య విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు సాంబశివరావు, అనిల్, విజయ్‌కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతే మా బ్రాండ్.. రైతులే మా అంబాసిడర్స్

- పాడి రైతుల అభ్యున్నతికి కృషి
- రూ 50 కోట్లు విడుదల చేసిన సిఎంకు ధన్యవాదాలు
- విజయ డైరీ చైర్మెన్ గుత్తా అమిత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ నాణ్యత, తమకున్న పాడి రైతులే తమకు బ్రాండ్ అని రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య (విజయ డెయిరీ) చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ లాలాపేట్‌లోని విజయ డెయిరీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో నిర్వహించిన చిట్ చాట్‌లో మాట్లాడారు. తన కుటుంబ నైపథ్యం డైరీకి సంబంధం ఉందని, రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ సహకారాన్ని తీసుకొని డెయిరీని అభివృద్ధి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు చెప్పారు. ర్యావిర్యాలలో నిర్మాణం చేసిన మేఘ డైరీలో ప్రస్తుతానికి ట్రయల్స్ నడుస్తున్నాయని, త్వరలోనే పూర్తిస్థాయిలో దాన్ని అందుబాటులో తీసుకొస్తామన్నారు. డెయిరీలో ఖర్చులు తగ్గించుకునేందుకు చర్యలు చేపట్టామని, అదే సమయంలో నాణ్యత విషయంలో రాజీపడబోమన్నారు. ప్రస్తుతం 50 ఏళ్ల నాటి టెక్నాలజీని జోడించి నిర్మించిన లాలాపేట్ విజయ డైరీని కొంత మేరకు నూతన టెక్నాలజీని జోడించి మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. మార్కెటింగ్‌లో ఇంకా ముందుకు పోవాల్సిన అవసరం ఉందని, దానికి అనుగుణంగా కొన్ని ప్రణాళికలు తయారు చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే జిఒ నెంబర్ 45ను విడుదల చేసిందని, దాని ద్వారా పలు ప్రభుత్వ సంస్థలకు పాలు సరఫరా చేస్తూ ఇక తెలంగాణలో పలు ప్రముఖ దేవాలయాలకు నెయ్యిని సరఫరా చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ సంస్థలూ విజయ పాలు కొనుగోలు చేసి డెయిరీని, పాల రైతులను ప్రోత్సహించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రూ 50 కోట్లతో జులై, ఆగస్టు నెలల పాల బిల్స్ ఇచ్చామని, మిగతా బిల్స్ కూడా త్వరలోనే ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో పలు ప్రయివేటు డెయిరీల నిర్వహణ, వాటి గురించి పలు అంశాలపై ప్రస్తావించారు. పోటీ ప్రపంచంలో ప్రయివేటు డైరీల పోటీని తట్టుకుంటూ ప్రభుత్వ సహకారాన్ని తీసుకుంటూ ముందుకు వెళ్తామన్నారు. పాల కొరతను అధిగమించి ఉత్పత్తిని పెంచేందుకు 2022 ఫిబ్రవరిలో, 2023 నవంబర్‌లో మూడు సార్లు పాల సేకరణ ధరను పెంచినట్టు చెప్పారు. దేశంలో అత్యధిక ధరను చెల్లిస్తున్నది విజయ డెయిరీనే అని అన్నారు.

సృజనశీలతకు హద్దులుండవు

- ఇస్రో చైర్మన్ సోమనాథ్



ప్రజాశక్తి కల్చరల్

సృజనశీలత కు హద్దులు ఉండవు అని ఎంచుకొన్న ఇష్టమైన రంగంలో లక్ష్యం గా ఉన్నత స్థాయికి ఎదగాలని ఇస్రో చైర్మన్ డాక్టర్ సోమనాథ్ అన్నారు రవీంద్ర భారతిలో భాషా సాంస్కృతిక శాఖ సహకారం తో తెలుగు ప్రాంత మలయాళీ అసోసియేషన్ హైద్రాబాద్ ఫోరం ఫర్ పొలిటికల్ కార్టూనిస్ట్ అసోసియేషన్ నిర్వహణ లో స్పేస్ టూన్ పేరిట కార్టూన్ ప్రదర్శన జరిగింది సాంస్కృతిక పర్యాటక శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు తో సోమనాథ్ ప్రదర్శన ఆరంభించి మాట్లాడారు తనకు చిన్ననాట కార్టూన్ సిరీస్ టిన్ టిన్ లో వేసిన స్పేస్ షిప్ కార్టూన్ ఎంతో ఆకర్షించింది అని తదుపరి తాను అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) కు చైర్మన్ కావడం సంతోషం అని తెలిపేరు భారత్ అతి స్వల్ప నిధి తో స్వల్ప కాలంలోనే ఎన్నో అంతరిక్ష ప్రయోగాలలో దూసుకి పోతోంది అని వివ రించారు మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ సామాన్యులను కూడా ప్రభావితం చేసే కళ కార్టూన్ అన్నారు ప్రముఖులు పలువురు గతం లో కార్టూన్ రంగం ను సుసంపన్నం చేశారు అన్నారు అర్ కె లక్ష్మణ్ రాజకీయ వ్యంగ్య చిత్రాలు గురించి చెప్పారు ఈ కార్యక్రమంలో విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి వెంకటేశం సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ తో పాటు నిర్వాహకులు లిబి బెంజమిన్ సుధీర్ నాథ్ శంకర్ ముత్యుంజయ కార్టూనిస్టు లు సుబానీ,నరసిం తదితరులు పాల్గొన్నారు

వరద నీరు నిలువకుండా శాశ్వతంగా పరిష్కరించాలి

- అక్రమంగా పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే జరిమానా వేయాలి
- జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి కాట



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు నిలువకుండా శాశ్వత పరిష్కారం చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి కాట అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని జిహెచ్ఎంసి కార్యాలయంలో అడిషనల్, జోనల్ కమిషనర్లు, ఇతర విభాగాల హెచ్ఒడిలతో మంగళవారం ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో కొన్ని ప్రాంతాల్లో వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు నిలిచి కాలనీవాసులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. వీటి పరిష్కారానికి ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి శాశ్వత పరిష్కారానికి అవసరమైన ప్రతిపాదనలు తయారు చేసి నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ కనెక్షన్ కమర్షియల్‌గా ఉండి, గృహ రెసిడెన్షియల్ టాక్స్ చెల్లిస్తున్న కమర్షియల్ ఆస్తులకు నోటీసులు జారీచేసి ట్యాక్స్ రివిజన్ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గుర్తించిన గృహాల యజమానులకు నోటీసుల జారీలో జోనల్ కమిషనర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. అక్రమంగా పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వారిపై పెద్ద మొత్తంలో జరిమానా వేయాలని డిప్యూటీ కమిషనర్లను ఆదేశించారు. నాలా కల్వర్టుల్లో ఫ్లోటింగ్ మెటీరియల్ వల్ల నీరు నిలిచి లోతట్టు ప్రాంతాల్లో వరద ముంపు ఏర్పడి కాలనీవాసులకు సమస్యలు రాకుండా వెనువెంటనే తొలగించాలని చెప్పారు. నాలాలో ఫ్లోటింగ్ మెటీరియల్ తొలగింపునకు చర్యలు చేపట్టాలని తెలిపారు. కమర్షియల్ స్ట్రెచేస్‌లో లిట్టర్ బిన్ ఏర్పాటుకు టెండర్ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో బిన్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్లను ఆదేశించారు.

పదేళ్లయినా పెరగని పరిహారం

- నిర్మాణ సంస్థలతో అధికారులు కుమ్మక్కు..?
- పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎల్అండ్‌టీలకు భూ సేకరణ
- సుమారు 3,200 ఎకరాలు కోల్పోతున్న రైతులు
- 2014లో నిర్ణయించిన 400 కేవీ లైన్ నష్టపరిహారాన్నే 765 కేవీ లైన్‌కు కేటాయింపు
- రైతుల అభిప్రాయాలను తీసుకోకుండా గుడ్డిగా అధికారుల నిర్ణయం
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు
- తమ భూముల్లో టవర్ లైన్లు వేయనివ్వమంటున్న రైతుల తిరుగుబాటు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజల పక్షాన నిలవాల్సిన ప్రభుత్వాలు, అధికారులు వ్యాపార సంస్థలకు కొమ్ముకాస్తూ.. ప్రజల సొమ్మును కొల్లగొడుతున్నారు. ప్రభుత్వ అధికారులు, బడా వ్యాపారులకు అనుకులంగా నిర్ణయాలు తీసుకోవడంతో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎల్అండ్‌టీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఎలక్ట్రికల్ ట్రాన్స్‌మిషన్ లైన్ నిర్మాణంలో రైతులు పెద్ద ఎత్తున భూములు కోల్పోతున్నారు. అయితే రైతుల భూములకు చెల్లించాల్సిన నష్టపరిహారంపై గందరగోళం నెలకొంది. ప్రస్తుత ధర ప్రకారం కాకుండా పదేళ్ల కిందట (2014లో) నిర్ణయించిన ధరనే చెల్లిస్తున్నారు. దాంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అధికారుల ఆనాలోచిత నిర్ణయాన్ని ప్రభుత్వం పరిశీలించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

కర్ణాటక రాష్ట్రం బీదర్‌లో ఏర్పాటు చేసిన భారీ సోలార్ పవర్ ప్లాంట్ నుంచి విద్యుత్‌ను కొనుగోలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు బీదర్ నుంచి మహేశ్వరం మండలం మీర్‌ఖాన్‌పేటలోని 765 కెవి పవర్ గ్రిడ్ సబ్‌స్టేషన్ వరకు సుమారు 190 కిలోమీటర్ల మేర భారీ టవర్లు, లైన్లు వేసేందుకు శ్రీకారం చుట్టారు. సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లోని 20 మండలాలు, 315 గ్రామాల మీదుగా సుమారు 3,200 ఎకరాల్లో ఈ లైను ఏర్పాటు చేయాలని భావించింది. బీదర్ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ బహిరంగ ప్రకటన కూడా జారీ చేసింది. ఈ లైన్ల నిర్మాణ కాంట్రాక్టును ఎల్అండ్‌టి సంస్థ దక్కించుకుంది. సాధారణంగా ఏదైన ప్రాజెక్టుకు భూమిని సేకరించాలంటే ముందు రైతులను సమావేశపరిచి అభిప్రాయం తీసుకోవాలి. వారికి ఆమోదయోగ్యమైన నష్టపరిహారం చెల్లించాలి. ఆ తర్వాతే పనులు మొదలు పెట్టాలి. కానీ నిర్మాణ సంస్థలు, ఉన్నతాధికారలు కుమ్మక్కై ప్రస్తుత భూముల ధరలను, రైతుల అభీష్టాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా పరిహారాన్ని నిర్ణయించారు. టవర్లనూ ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమైంది. దాంతో రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది. తమకు న్యాయం జరిగే వరకూ నిర్మాణాలు చేపట్టొద్దని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇతర జిల్లాలతో పోలిస్తే రంగారెడ్డి జిల్లాలో గజం భూమి ధర వేలల్లో పలుకుతోంది. ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా ఈ భూముల ధరలు ఉన్నాయి. మార్కెట్ విలువను పరిగణనలోకి తీసు కోకుండా గత పదేళ్ల కింద నిర్ణయించిన పరిహారాన్ని చెల్లించడంపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి.

2014లో చెల్లింపులు ఇలా..

2013-14లో రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల మీదుగా 400 కేవీ ఎలక్ట్రికల్ ట్రాన్స్‌మిషన్ నిర్మించినప్పుడు రైతులు తమ సమస్యలను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దాంతో రైతులు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు, తదితరులతో కలెక్టర్ చర్చలు జరిపారు. మార్కెట్ ధర ప్రకారం ఒక్క టవర్ నిర్మాణం వల్ల కోల్పోనున్న 350 గజాల భూమికి రోడ్డు ఫేసింగ్ భూములకు రూ.4.5 లక్షలు, లోపలున్న భూములకు రూ.3.5 లక్షలు, అదే విధంగా ట్రాన్స్‌మిషన్ లైన్ ద్వారా కోల్పోనున్న భూమికి రోడ్ ఫేసింగ్ భూములకు గజానికి వెయ్యి రూపాయలు, లోపలున్న భూములకు గజానికి రూ.700 నష్టపరిహారం చెల్లించారు. ఈ ధర ప్రకారమే ప్రస్తుతమూ చెల్లిస్తామని అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై రైతుల్లో వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. గతంలో లాగా కాకుండా గతంలో చెల్లించిన దాని కంటే ఐదు నుంచి ఆరు రెట్లు ఎక్కువ చెల్లించాలని, ఈ ప్రకారం ఒక్కో టవర్, కారిడార్ లైన్‌కు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

నిర్మాణ సంస్థలకు ఒక న్యాయం.. రైతులకు ఒక న్యాయమా?

విద్యుత్ టవర్ల నిర్మాణానికి అవసరమైన అల్యూమినియం, స్టీలు, సిమెంట్, కూలీలను ప్రస్తుత ధరలకు అనుగుణంగా నష్టపరిహారం నిర్ణయించారు. రైతులు సాగు చేసే భూములకు మాత్రం పదేళ్ల కింద నిర్ణయించిన పరిహారాన్ని చెల్లిస్తున్నారు. దీన్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అంతేకాదు 400 కేవీ లైన్‌కు నిర్ణయం చేసిన నష్టపరిహారాన్నే 765 కెవి లైన్‌కు చెల్లిస్తుండటంపై అనేక అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. రైతుల ఆమోదం లేకుండా వారి భూముల్లో టవర్లు నిర్మించడంతో పాటు పరిహారం కూడా చాలా తక్కువ చెల్లిస్తుండటంపై సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా నష్టపరిహారాన్ని చెల్లించకపోతే.. లైన్ల ఏర్పాటు ప్రక్రియను అడ్డుకోవడానికి కూడా వెనుకాడ బోమని రైతులు, భూ బాధితులు హెచ్చరిస్తున్నారు. అంతేకాదు, కర్నూలు నుంచి వచ్చే లైనుకు జారీ చేసిన ఉత్తర్వులను బీదర్‌లైన్‌కు చూపించి ప్రయివేట్ భూముల్లో టవర్లు నిర్మించడం ఎంతవరకు సమంజసమని రైతులు ప్రశ్నిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

అధికారులది ఏకపక్ష నిర్ణయం

ప్రభుత్వ అధికారులు రైతుల పక్షపాతిగా వ్యవ హరించాలి. వారికి అన్యాయం జరగకుండా చూడాలి. కానీ ప్రయివేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవ హరిస్తున్నారు. రైతులకు తీరని అన్యాయం చేశారు. పదేళ్ల కింద నిర్ణయించిన నష్టపరిహారానికి ఐదు నుంచి ఆరు రెట్లు అదనంగా నష్టపరిహారం పెంచాల్సి ఉంది. ప్రస్తుత ధర ప్రకారమే నష్టపరిహారం చెల్లించాలి.

- చింపుల సత్యనారాయణరెడ్డి, అధ్యక్షులు, తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్

అభ్యుదయ సాహితీ వైతాళికుడు గురజాడ

ప్రజాశక్తి కల్చరల్

తెలుగు భావ కవిత్వ వైతాళికుడు రాయప్రోలు సుబ్బారావు కాగా అభ్యుదయ సాహిత్య వైతాళికుడు గురజాడ అప్పారావు అని ప్రముఖ కవి డాక్టర్ సి నారాయణ రెడ్డి తన పరిశోధనా గ్రంధం లో పేర్కొన్నారని సి బి ఐ న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగ మారుతీ శర్మ గుర్తు చేశారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సంగీత నాట్య వేదిక పై గాన సభ నిర్వహణ లో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా గురజాడ అప్పారావు యాదీ లో సమావేశం జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ నాగ మారుతీ శర్మ మాట్లాడుతూ గురజాడ రచించిన దేశ మంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్ అనే గీతం నినాదంగా నేటికీ నిలిచివుందని అన్నారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో సాహితీవేత్త శైలజా మిత్ర, గాన సభ సంయుక్త కార్యదర్శి చక్ర పాణి,న్యాయవాది శ్రీలత వర్మ పాల్గొన్నారు




యువ అథ్లెట్ దీప్తి జీవాంజికి చెక్‌ను అందజేస్తున్న సిఎం

యువ అథ్లెట్ దీప్తి జీవాంజికి గ్రూప్ 2 ఉద్యోగం : సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పారలింపిక్స్ లో కాంస్య పతకం సాధించిన తెలంగాణ యువ అథ్లెట్ దీప్తి జీవాంజికి రూ. కోటి, కోచ్‌కు రూ.10లక్షలు చెక్స్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందజేశారు. ఈ నెల 7న దీప్తికి గ్రూప్-2 ఉద్యోగం, రూ.కోటి నగదు బహుమతి, వరంగల్ లో 500 గజాల స్థలం, కోచ్ కు రూ.10లక్షలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంగళ వారం జూబ్లీహిల్స్ లోని సిఎం నివాసంలో దీప్తి జీవాంజీ, కోచ్ ముఖ్యమంత్రిని కలిశారు.


మొగిలయ్యకు ఇంటి స్థల ధ్రువ పత్రం అందజేస్తున్న సిఎం రేవంత్

పద్మశ్రీ మొగిలయ్యకు ఇంటి స్థలం

- ధ్రువ పత్రాలు అందజేసిన సిఎం

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ కిన్నెర వాయిద్యకారుడు పద్మశ్రీ దర్శనం మొగిలయ్యకు ఇంటి స్థలం ధ్రువపత్రాలను సిఎం రేవంత్ రెడ్డి మంగళవారం అందజేశారు. మొగిలయ్యకు హయత్ నగర్ లో 600 చ.గజాల స్థలాన్ని. ప్రభుత్వం కేటాయించింది. స్థల ధ్రువీకరణ పత్రం అందజేయడంపై మొగిలయ్య హర్షం వ్యక్తం చేసారు.



ముంపు ప్రాంత ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

అర్హులందరికీ పరిహారం అందాలి

- ఖమ్మం వరద ముంపు ప్రాంతాల్లో మంత్రి పొంగులేటి పర్యటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మున్నేరు వరదముంపు ప్రాంతాలైన ఖమ్మంరూరల్ మండలంలోని రాజీవ్ గృహకల్ప, జలగం నగర్ ప్రాంతాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం పర్యటించారు. వరద బాధితులను పరామర్శించి వారి సంక్షేమం గురించి అడిగి తెలుసుకున్నారు. వరద సహాయక చర్యలు, ప్రభుత్వ సాయం గురించి ఆరా తీశారు. కొందరు వరద బాధితులు తమకు ప్రభుత్వం నుంచి ఇచ్చే సాయం అందలేదని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అధికారులను పిలిచి వాస్తవంగా ఇళ్లు నీట మునిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సాయం అందాలని, మరోసారి ఇంటింటి సర్వే చేపట్టి అర్హులను గుర్తించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అనర్హులకు ఒక్కరికీ పరిహారం అందడానికి వీలులేదని హెచ్చరించారు. వీధులన్నీ శుభ్రం చేసి దుర్వాసనలు రాకుండా బ్లీచింగ్ చల్లాలని సూచించారు. వరద ముంపు ప్రాంత ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడటమే కాకుండా ప్రభుత్వ సాయం అందేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మదుసూదన్‌నాయక్, ఆర్‌డిఒ గణేశ్, తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపిడిఒ కుమార్, ఎంపిఒ రాజారావు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

'నవతెలంగాణ' స్పెషల్ కరస్పాండెంట్ బసవపున్నయ్యకు పితృవియోగం

- లక్ష్మయ్య భౌతికకాయాన్ని ఎయిమ్స్ ఆస్పత్రికి అప్పగింత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నవతెలంగాణ దినపత్రిక స్పెషల్ కరస్పాండెంట్ బొడిగే బసవపున్నయ్యకు పితృవియోగం ఏర్పడింది. బసవపున్నయ్య తండ్రి ప్రముఖ న్యాయవాది బొడిగె లక్ష్మయ్య (77) సోమవారం రాత్రి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో మృతిచెందారు. మంగళవారం ఉదయం ఆయన భౌతికకాయాన్ని స్వగ్రామమైన రామన్నపేట మండలంలోని శోభనాద్రిపురం గ్రామానికి తరలించారు. గ్రామంలో బంధువులు, స్నేహితులు, గ్రామస్తుల సందర్శన అనంతరం బుడిగె లక్ష్మయ్య కోరిక మేరకు కుమారులు సుందరయ్య, బసవపున్నయ్య, కుటుంబ సభ్యులు.. ఆయన భౌతికకాయాన్ని వైద్య విద్యార్థుల పరిశోధన నిమిత్తం బిబినగర్ ఎయిమ్స్ హాస్పిటల్‌కు అందజేశారు. ఇంటి నుంచి ఊరి చివరి వరకు బంధువులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు అంతిమయాత్రలో పాల్గొని నివాళు లర్పించారు. అనంతరం అంబులెన్స్‌లో లక్ష్మయ్య భౌతికకాయాన్ని బిబినగర్ ఎయిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు.